షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 22 నవంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-



## బీఆర్ఎస్ మహాధర్నాకు

# హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధర్నా చేపట్టేందుకు హైకోర్టు అనుమతి
- వెయ్యి మందితో ధర్నా చేపట్టొచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది
- బీఆర్ఎస్ మాత్రం 50 వేల మందితో మహా ధర్నా చేపడతామని మొదట ప్రకటించింది
- ఇప్పుడు హైకోర్టు తీర్పుతో.. తక్కువ మందితోనే ధర్నా కార్యక్రమం నిర్వహించే అవకాశం

## మూసీ వరం కావాలి...

# శాపం కాదు

- మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం..
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- "నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి నదులను కబళిస్తే.. మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది
- మూసీ ప్రక్షాళన చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పం
- ఈ తరానికే కాదు.. తరతరాలకు మేలు చేసే నిర్ణయం
- బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపడతాం..
- పర్మిషన్ ఉన్న ఇండ్లకు నష్టపరిహారం చెల్లిస్తాం



హైదరాబాద్

హైదరాబాద్ కు మూసీ వరం కావాలి కానీ శాపం కావద్దొని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవంపై ఎక్స్ పోస్టులో సీఎం ఎమోషనల్ అయ్యారు. నదుల వెంట నాగరికత వర్ధిల్లాలని, వాటిని కనుమరుగయ్యేలా చేస్తే మనిషి మనుగడే ప్రశ్నార్ధకం అవుతుందని హెచ్చరించారు. ప్రజారోగ్యం, పటిష్ఠ ఆర్థిక పర్యావరణ కోణాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్ కు మూసీ ఒక వరం కావాలని అభిప్రాయపడ్డారు. కానీ శాపంలా మారకూడదని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పం అని తెలిపారు. ఇది ఈ తరానికే కాదు, భావి తరాలకు సైతం మేలు చేసే నిర్ణయం అని పేర్కొన్నారు. - మిగతా3లో



## అదానీ, మోదీ

# ఇద్దరూ ఒక్కటే

- అదానీని అరెస్ట్ చేయాల్సిందే
- 'సెకీ ఒప్పందాల్లో జరిగిన అవినీతిని బయట పెట్టాలి
- అదానీని అరెస్ట్ చేసి విచారిస్తే సెకీ అక్రమాలు వెలుగులోకి వస్తాయి
- అదానీ విద్యుత్ ఒప్పందాల్లో అవినీతిపై అమెరికా కోర్టులో కేసులు కూడా పెట్టారు.
- భారత, అమెరికా చట్టాలను గౌతం అదానీ ఉల్లంఘించారు
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

## తొలిసారిగా కాగ్ పదవిలో తెలుగు వ్యక్తి

నూతన కాగ్‌గా కొండ్రు సంజయ్ మూర్తి

నేడు రాష్ట్రపతి ముర్ము సమక్షంలో పదవీ స్వీకారం

అమలాపురం మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి తనయుడే సంజయ్ మూర్తి

ఇప్పటిదాకా గిరీశ్ చంద్ర ముర్ము కాగ్ గా బాధ్యతలు నిర్వర్తించారు.





## ఈ ప్రభుత్వం ప్రజా పాలన చేస్తుంది

- వారు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు.. భట్టి విక్రమార్క వార్నింగ్
- ప్రజా ప్రభుత్వం ప్రజలతో మమేకం అవుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటుంది
- ముఖాముఖీ కార్యక్రమానికి రావడం జరిగింది
- కేసీఆర్ ప్రభుత్వం ఎప్పుడు గడిల మధ్య ఉండి పాలన చేసింది
- విద్య, వైద్యం మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టీ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం

హైదరాబాద్

కుల గణనపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. కుల గణన అడ్డుకోవాలని కొందరు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కొందరు దోపిడీ దారులు కులగణనపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎందరు కుట్ర చేసినా కుల గణనను విజయవంతం చేస్తామని అన్నారు. ఇవాళ(గురువారం) గాంధీభవన్‌లో మీడియా సమావేశం - మిగతా3లో



## మోదీకి అరుదైన గౌరవం

- అత్యున్నత పురస్కారాలతో సత్కరించిన డొమెనికా, గయానా
- కొవిడ్ సమయంలో తమ దేశానికి మోదీ అందించిన సహాయ సహకారాలకు గానూ ఈ అవార్డును అందించారు.

## డిసెంబర్ 9వ తేదీ నుంచి

# అసెంబ్లీ సమావేశాలు

- సమావేశాల్లో దాని మీదే ఫోకస్
- రైతు, కులగణన సర్వేపై కూడా సమావేశాల్లో చర్చించే అవకాశం కనిపిస్తోంది
- అసెంబ్లీ సమావేశాలతో పాటు మంత్రివర్గ విస్తరణ మీద కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది.
- డిసెంబర్ 7వ తేదీతో రేవంత్ సర్కార్ ఏడాది కాలం పూర్తి చేసుకోనుంది



హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై స్పష్టత వచ్చింది. డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి క్లారిటీ వచ్చింది. సమావేశాల్లో పలు కీలక చట్టాల ఆమోదానికి రేవంత్ సర్కారు ప్లాన్ చేస్తోంది. ఆర్ఓఆర్ చట్టాన్ని ఆమోదించాలని చూస్తోంది. రైతు, కులగణన సర్వేపై కూడా సమావేశాల్లో చర్చించే అవకాశం కనిపిస్తోంది. అసెంబ్లీ సమావేశాలతో పాటు మంత్రివర్గ విస్తరణ మీద కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికలు అప్పుడే.. డిసెంబర్ 7వ - మిగతా3లో

## 5.8 కోట్ల నకిలీ రేషన్ కార్డుల ఎత్తివేత

- 20.4 కోట్ల రేషన్ కార్డుల డిజిటలీకరణ పూర్తి
- 5.8 కోట్ల నకిలీ రేషన్ కార్డుల ఏరివేత: కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ
- ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా దేశంలో మొత్తంగా 80.60 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం
- దేశవ్యాప్తంగా 5.33 లక్షల చౌక ధరల దుకాణాలకు ఈపోస్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి

# అన్నింటిలో కాంగ్రెస్ సర్కార్ విఫలం

- మాజీ మంత్రి హరీష్‌రావు ఘాటు విమర్శలు
- ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది
- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలులో పూర్తిగా విఫలమైంది
- దళిత గిరిజన అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతోంది

హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్‌రావు ఘాటు విమర్శలు చేశారు. గురువారం అందోల్ మండలం మాసాన్ పల్లీ గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారని.. ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చగలిగారా అంటూ విమర్శలు గుప్పించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలులో పూర్తిగా విఫలమైందని వ్యాఖ్యలు చేశారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో, పెట్టుబడి సాయం - మిగతా3లో



# చట్ట సభల్లో ముదిరాజులకు ప్రాధాన్యత ఇవ్వాలి

- బీసీ గణన వివరాలు బయటపెట్టాలి
- ముదిరాజ్ లను బీసీ డి నుంచి బీసీ ఏ లోకి మార్చాలి
- ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో పదేళ్లలో విశేష అభ్యున్నతి
- తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బయ్యు ఉపేందర్



**షణ్ముఖ వెలుగు ప్రతినిధి మరిపెడ మండలం నవంబరు 21**
తెలంగాణ రాష్ట్రంలోని బీసీ జనాభాలో ముదిరాజులు అత్యధికంగా 13శాతం ఉన్నారని, అటువంటి ముదిరాజులకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బయ్యు ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహా సభ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మరిపెడ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై జెండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన పదేళ్లలో శాసన మండలి చైర్మెన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాల నుంచి మత్స్య కార్మికులకు సుమారు 1000 కోట్ల వరకు లబ్ధి చేకూరిందని, గ్రామాల్లోని సొసైటీల్లో సభ్యులకు మోపెడ్ లు, ట్రాలీలు, ఉచిత చేప పిల్లలు అందేలా ముదిరాజ్ మహాసభ కృషి చేసిందన్నారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ మత్స్యకారులకు చెరువుల్లో ఉచిత చేప పిల్లల పంపిణీ కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ గణన అనంతరం ముదిరాజు లకు ప్రాధాన్యత కల్పించాలని, బీసీ గణన వివరాలు బయట పెట్టాలన్నారు. అదే విధంగా ఎన్నో ఏళ్లుగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న ముదిరాజులకు బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హాయాంలో జీవో ఇచ్చినా, మిగత కారణాలతో అది నిలిచిపోందన్నారు. తిరిగి ఇప్పుడు చేస్తున్న కులగణన అనంతరం బీసీ కమిషన్ ద్వారా సమాచారాన్ని సేకరించి, ముదిరాజుల స్థితి గతులను పరిశీలించి బీసీ ఏ లోకి మార్చాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ముదిరాజులు అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరిపెడ 12 వార్డు కౌన్సిలర్ బయ్య బిక్షం, సొసైటీ డైరెక్టర్లు సూరబోయిన మల్లయ్య, కొండ ఉప్పలయ్య, చిదుముల వెంకన్న, కర్నె ఉప్పలయ్య, కొండ చిన్న ఉప్పలయ్య, సుంకరి రవి, సుంకరి శ్రీను, తమ్మనబోయిన లక్ష్మయ్య, సొసైటీ సభ్యులు బయ్య పెద్ద బిక్షం, సుంకరి ఉప్పలయ్య, బొజ్జ నర్సింహా, వెంకన్న, రమేష్, సుంకరి అశోక్, యాకుబ్, కర్ణాకర్, నక్కా మల్లేష్, బిక్షం, మహేష్, లింగయ్య, శ్రీను, మల్లయ్య, యల్లయ్య, సుంకరి కార్తిక్, వెంకటేష్, మత్స్యకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# చెలరేగిపోతున్న సైబర్ నేరగాళ్లు.. ముంబై పోలీస్ పేరుతో దోపిడీ..

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి నవంబరు 21:** హాలో.. మీ పేరు పైన పార్సిల్ వచ్చింది.. అందులో అభ్యంతరకరమైన వస్తువులు ఉన్నాయి. మీ కాల్ ను పోలీసులకు ట్రాన్స్ ఫర్ చేస్తున్నాము.. మాట్లాడండి..అంటూ ఫేక్ కాల్స్ చేసి ఇంటరాగేషన్ పేరుతో భయభ్రాంతులను గురిచేసి అందిన కాడికి దోచుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. బాధితులకు ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసుల పేరిట వస్తున్న ఈ తరహా ఫోన్ కాల్స్ ఉచ్చులో పడి వేలు లక్షల రూపాయలు డబ్బులు పోగొట్టుకుంటున్నారు ముంబై పోలీసులంటూ వీడియో కాల్ విచారణ అంటూ ఫోన్ చేస్తున్నారు..?

**నమ్మించడానికి ఎలా ప్రవర్తిస్తున్నారు..? ఏం చేయాలి..? ఎలా స్పందించాలి ..? అనే అంశం పై కథనం**

తొలుత పార్సిల్ వచ్చిందని సైబర్ నేరగాళ్లు ముందుగా మీ పేరిట ఫెడెక్స్ పార్సెల్ వచ్చిందని, అది తైవాన్ లేదా ఇరాన్ నుంచి ముంబైకి పార్సిల్ వచ్చిందని, అందులో కొన్ని సందర్భాలలో డ్రగ్స్ ఉన్నాయని మరికొన్ని సందర్భాలలో అభ్యంతరకరమైన వస్తువులు ఉన్నాయంటూ ఫోన్లు చేస్తారు. అనంతరం ఈ విషయమై ముంబై పోలీసులు కేసునమోదు చేశారంటూ, మీ కాల్ ను వాళ్లకి ఫార్వర్డ్ చేస్తున్నాము అంటూ లైన్ కలుపుతారు.

**అచ్చంగా పోలీసులు లాగానే..**

పార్సిల్ నేపంతో వచ్చిన ఫోన్ కాల్.. అనంతరం ముంబాయి క్రైమ్ బ్రాంచ్ ఎస్సై కి ట్రాన్స్ ఫర్ అవుతుంది. ఆయన అచ్చం పోలీసు లాగానే మాట్లాడుతూ మీపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి అంటూ పై అధికారులు మిమ్మల్ని ఇంటరాగేషన్ చేస్తారు. అంటూ సీఐ లేదా ఏసీపీ స్థాయి అధికారి నుంచి స్కైప్ లేదా ఫోన్ వీడియో కాల్ లో మాట్లాడటం జరుగుతుంది. ఇక అధికారి వీడియో కాల్ లోనే పలు రకాలుగా ఇంటరాగేషన్ చేస్తూ అవతలి వ్యక్తులతో అసలైన పోలీస్ అధికారిగా ప్రవర్తిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తాడు. ఆఖరికి మీ ఎకౌంటు ను వెరిఫికేషన్ చేయాలని చెప్పి లింకు ద్వారానో యూపీఐ ద్వారాను డబ్బులను సైబర్ నేరగాళ్ల అకౌంట్స్ లోకి రాబట్టుకుంటున్నారు. ఇంటరాగేషన్ లో అచ్చంగా పోలీస్ స్టేషన్ సెట్ సైబర్ నేరగాళ్లు ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసుల పేరిట వీడియో కాల్ లో ఇంటరాగేషన్ చేసే సమయంలో బాధితులను నమ్మించడానికి పక్కాగా వ్యవహరిస్తున్నారు. వీడియో కాల్ సమయంలో పోలీసులు గా వ్యవహరించే వారు మాట్లాడుతున్నప్పుడు వారి బ్యాక్ గ్రౌండ్ లో ఉన్న సీనరీ కూడా అచ్చం పోలీస్ స్టేషన్ లాగానే కనబడే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మధ్య మధ్యలో స్టాఫ్ వచ్చి సెల్యూట్ లు కొట్టడం, పోలీస్ స్టేషన్ లో ఇంటరాగేషన్ చేస్తున్న సమయంలో బాధితులు అరవడం వంటివి వీడియో కాల్ లో కనిపించే విధంగా లేదా వినిపించే విధంగా చేస్తూ బాధితులను పక్కాగా నమ్మించే విధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో భాదితులు కాల్ వచ్చింది నిజంగా ముంబై పోలీసుల నుంచే వచ్చిందని నమ్మేస్తున్నారు.

**విద్యావంతులే మోసపోతున్నారు..**

ఇక ముంబై పోలీస్ తరహా సైబర్ నేరాలలో ఎక్కువగా మోసపోతున్నది ఉన్నత విద్యావంతులే. వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అయితే మరి కొందరు సాఫ్ట్వేర్ ఉద్యోగులు. అతికొద్ది సందర్భాలలోనే సామాన్యులు లేదా గృహిణులు ఉంటున్నారు. ఈ మధ్యకాలంలో జరిగిన ఘటనలు పరిశీలిస్తే ఫారెస్ట్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్, చార్టెడ్ అకౌంటెంట్, ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీలలో ఉన్నత స్థాయి ఉద్యోగులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిన వారిలో ఉన్నారు. ముంబై పోలీస్ సైబర్ నేరగాళ్లు అన్ని సందర్భాలలో ఒకేలా వ్యవహరించడం లేదు. ఒక సందర్భంలో పార్సిల్ వచ్చిందని, మరొక సందర్భంలో మీ పిల్లవాడు డ్రగ్స్ కేసులో ఉన్నాడని, మరొక సందర్భంలో విదేశాలలో మీ పిల్లవాడు రేప్ కేసులో ఇరుక్కున్నాడని ఫోన్ చేయడం పరిపాటిగా మారింది. "మచ్చుకు కొన్ని ఘటనలు.. ఈ మధ్యకాలంలో ముంబై పోలీసుల మంటూ ఫోన్ చేసి బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు భారీగానే దోచుకుంటున్నారు. ఈ మధ్యనే నగరంలో ఓ పోలీస్ స్టేషన్లో సీఐగా పనిచేస్తున్న ఓ పోలీసు అధికారికి సైతం ముంబై పోలీసుల పేరిట ఫోన్ చేసి ఫ్రాడ్ చేసే యత్నం చేశారు. ఇటీవల జరిగిన కొన్ని ముంబై పోలీస్ సైబర్ నేరగాళ్ల కేసులను పరిశీలిస్తే.. కళావతి నగర్ కు చెందిన ఓ మహిళలకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీ అమ్మాయి వద్ద డ్రగ్స్ దొరికాయని, ఆమె చదువుతున్న కళాశాల విద్యార్థుల వద్ద కూడా డ్రగ్స్ కేసు ఇన్వాల్వ్ అయ్యారని, డబ్బులు పంపిస్తే వదిలేస్తామని లేకపోతే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో హ్యాండ్ అవర్ చేస్తామని బెదిరించి ఆమె వద్ద నుంచి 25 వేల రూపాయలను దోచుకున్నారు.

మీ ఫోన్ బ్లాక్ అవుతుంది ఆధార్ కార్డు ఫ్రాడ్ వినియోగానికి మీరు ఉపయోగించారు, మీరు దోషులు కాకపోతే ముంబై పోలీసులకు ఫోన్ చేయండి అని ఏకంగా ఫారెస్ట్ ఆఫీసర్ కు ఫోన్ చేసి ఆమెతో వీడియో కాల్ లో ఇంటరాగేషన్ చేస్తూ భయభ్రాంతులను గురిచేసి రూ 35000 కొల్లగొట్టారు.



బాచుపల్లికి చెందిన చార్టెడ్ అకౌంట్ కు ముంబై ఐటీ ఇన్స్పెక్టర్ అంటూ ఫోన్ చేసి వీడియో ఇన్వెస్టిగేషన్ కాల్ లో సీఐ, ఎస్సై, డీఎస్పీ స్థాయి అధికారులు అంటూ ఇంట్రాగేషన్ చేస్తూ మీరు మనీలాండరింగ్, చైల్డ్ ట్రాఫికింగ్ కు పాల్పడ్డారంటూ పలు విధాలుగా వీడియో కాల్ ఇంట్రాగేషన్ చేసి 44 వేల రూపాయలను రాబట్టుకున్నారు సైబర్ నేరగాళ్లు.
జగద్గిరిగుట్ట వెంకటేశ్వర నగర్ కు చెందిన ఓ సాఫ్ట్వేర్ మహిళకు టెలికాం డిపార్ట్మెంట్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెబుతూ మీ ఫోను ఇల్లీగల్ ఆక్టివిటీస్ కి వాడుతున్నారు, మీ కాలనీ ముంబై పోలీసులకు ట్రాన్స్ఫర్ చేస్తున్నామంటూ వీడియో కాల్ లో మాట్లాడుతూ దాదాపుగా రెండు గంటలసేపు ఇంటరాగేషన్ చేసిన అనంతరం 50 వేలను ట్రాన్స్ఫర్ చేపించుకు.

**వీడియో కాల్ ఇంటరాగేషన్ అంటే అసలు నమ్మకండి : జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సీఐ గడ్డం మల్లేష్**

ముంబై పోలీసులు అంటూ ఎవరైనా ఫోన్ చేస్తే ఏమాత్రం స్పందించకండి. పోలీసులు వీడియో కాల్ లో ఇంట్రాగేషన్ చేయడం జరగదు. కాబట్టి ఎవరు కూడా ముంబై పోలీసులు అంటూ ఫోన్ చేసి ఇంట్రాగేషన్ పేరిట వీడియో కాల్ చేస్తే పట్టించుకోకండి. మీకు ఏమైనా అనుమానాలు ఉంటే ఏమాత్రం భయపడకుండా స్థానిక పోలీస్ స్టేషన్ కి వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోండి. అవగాహనతోనే ఇలాంటి సైబర్ నేరాలను కట్టడి చేయగలం.

# ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

ముదిరాజ్ లు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉంది...
మత్స్యకార సంఘం మండల అధ్యక్షులు గోల్డ్ బాలస్వామి



**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి నవంబరు 21:** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండ ప్రకాష్ ముదిరాజ్ పిలుపు మేరకు గురువారం పెబ్బేరు మత్స్య సహకార సంఘం భవనంలో జెండా ఎగుర వేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం మండల అధ్యక్షులు గోల్డ్ బాలస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన పది రకాల హామీలు వెంటనే నెరవేర్చాలని సీఎం రేవంత్ రెడ్డి మత్స్యకారులకు అండగా ఉండడంతో మత్స్యకారులు చేపల పెంపకంలో ముందడుగు లో ఉన్నారన్నారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు.మత్స్యకారులకు ఉచితంగా చేపల పంపిణీ సబ్సిడీతో పాటు వాహనాలు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు అన్నిరకాల ప్రోత్సాహం అందుతుందని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ముదిరాజు లకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.సంఘం నాయకులు ఐక్యంగా ఉండి వృత్తిని కొనసాగించుకోవాలన్నారు. ముదిరాజు లు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం పట్టణ అధ్యక్షులు చింతకాయల కురుమూర్తి కార్యదర్శి మహేష్ గోనెల సహదేవుడు,భీముడు,యువజన సంఘం గౌరవ అధ్యక్షులు సంగనమోని శ్రీనివాసులు అధ్యక్షులు గోనెల భరత్ వెంకటేష్,దేవి ప్రసాద్ నరసింహ రఘు కటికల పురుషోత్తం రాముడు ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు

## రైతన్నపై నీవు చేసిన దమనకాండ ను ప్రశ్నిస్తే వణుకెందుకు రేవంత్ రెడ్డి...?

ఎమ్మెల్యే కెపి.వివేకానంద్...



**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి నవంబరు 21:** చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మానుకోట మహా ధర్నా అనుమతులను నిరాకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్యే కెపి వివేకానంద్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ దేశానికే వెన్నెముక అయిన రైతు భూములను ఫార్మా సిటీ పేరుతో అల్లుడి కోసం బలవంతంగా లాక్కుంటుంటే, రైతులపై నీవు చేసిన దమనకాండను, రైతు వ్యతిరేక విధానాలను మా నాయకుడు కేటీఆర్ ప్రజల్లోకి తీసుకెళ్తుంటే నీ వెన్నులో వణుకెందుకు సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలి, రైతు రాజులా బ్రతకాలి అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా రైతు రుణ మాఫీ, రైతు బంధు వంటి పథకాలతో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వ్యవసాయాన్ని పండుగ గా మారిస్తే, ప్రభుత్వ మారిన 11 నెలల్లోనే నీ అనాలోచిత నిర్ణయాలతో రైతాంగాన్ని, వ్యవసాయాన్ని దండుగ గా మారుస్తున్నావు ఫార్మా సిటీకి ఎందుకు పనికిరాని బీడు భూములు తీసుకోవాలి. కానీ కాంగ్రెస్ మాత్రం వ్యవసాయం వద్దు.... ఫార్మా సిటీ యే ముద్దు అనేట్టు గా పచ్చటి భూములను లాక్కుంటూ రైతుల నోటి కాడి బుక్కనుల్లాకుంటుంది. వ్యవసాయం పై ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మహాధర్నా చేపట్టేందుకు సిద్ధమవగా మహాధర్నాకు అనుమతులు లేవంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హేయమైన చర్య పోలీస్ శాఖను మీకు ఇష్టం వచ్చినట్లుగా వినియోగించుకొని మహాధర్నా కార్యక్రమాన్ని ఆపవచ్చు కానీ ప్రజల్లో రోజు రోజుకు మీ ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత నుంచి తప్పించుకోలేరు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల వాణిని ప్రభుత్వానికి వినిపించాల్సిన బాధ్యత మాపై ఉంది. ప్రజల సమస్యలపై నిత్యం పోరాడే నాయకులు కేటీఆర్ ప్రభుత్వ తాటకు చప్పులకు భయపడే రకం కాదు. మాది ఉద్యమ పార్టీ పోరాటాలు, అరెస్టులు, జైలు లు మాకు కొత్తేమి కాదు. ప్రజల పక్షాన నిలబడతాం, ప్రజల కోసం కొట్లాడుతాం.... అలుపెరుగని పోరాటం చేస్తాం.

## ఆర్థిక ఇబ్బందులతో దుబాయ్ లో యువకుని ఆత్మహత్య





**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ ప్రతినిధి నవంబరు 21:** ఉన్న ఊరిలో ఉపాధి లేక పరాయి దేశానికి ఎన్నో ఆశలతో వలస వెళ్ళాడు. తన కుటుంబ భవిష్యత్తు బాగుంటుందని కలలు కన్నాడు కన్న తల్లితండ్రులను, కట్టుకున్న భార్యా పిల్లలకు దూరంగా ఉన్న తన బాధలన్నీ దిగమింగుకొని తాను సంపాదించిన డబ్బుతో వారందరినీ సుఖ పెట్టాలనుకున్నాడు పాపం అతడి ఆశలు, కలలు అన్ని కూడా ఆవిరైపోయాయి. పని చేస్తున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో తీవ్ర మనోవేదనకు గురై చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల శ్రీనివాస్( 35) అను యువకుడు గత మూడు సంవత్సరాల క్రితం దుబాయ్ దేశానికి వెళ్ళాడు. ఆర్థిక ఇబ్బందులతో బుధవారం రోజున ఊరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య అనిత ( 30 ) ముగ్గురు ఆడ పిల్లలు కావ్య ( 13 ) ఆశ్విత ( 11 ) వైష్ణవి ( 8 ) ఉన్నారు. అతని మరణ వార్తతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా ఆత్మహత్యకు సంబందించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వికలాంగురాలు మాల మహేశ్వరి కి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖరరెడ్డి చేయూత



**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి నవంబరు 21:** పెబ్బేరు మండలంలోని యాపర్ల గ్రామానికి చెందిన మాల మహేశ్వరి కి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆర్థిక సహాయం తో గురువారం కుట్టు మిషన్ ను అందజేశారు. వివరాల్లోకి వెళితే యాపర్ల గ్రామానికి చెందిన మాల మహేశ్వరి కి గ్రహణ మొర్రి చెవులు సరిగ్గా వినపడవు, అదే క్రమంలో మాటలు సరిగ్గా రావు తన పెన్షన్ డబ్బులలో నెలకు వేయి రూపాయలు ఇస్తామని కుట్టు మిషను యిప్పించమని స్థానికంగా ఉన్న ఓ పాత్రికేయుడిని అడిగింది.ఇట్టి విషయం తెరాస యువ నాయకుడు వడ్డె రమేష్ దృష్టికి తీసుకొచ్చారు.మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించి ఆర్థిక సాయం అందించారు.యాపర్ల మాజీ సర్పంచ్ ఆనంద్, అడ్వకేట్ కిషోర్ కుమార్ రెడ్డి లు కుట్టు మిషన్ ను మహేశ్వరి కి అందించారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి ముని స్వామి రామకృష్ణ గోఖారి రవి గౌడ్ అంజి బాలకృష్ణ రాముడు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణం పై అవగాహన కొరకు "వనదర్శిని "






**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి నవంబరు 21:** ప్రభుత్వ అటవీశాఖ - పాకాల వన్యప్రాణి విభాగం నర్సంపేట రేంజ్ ఆధ్వర్యంలో నర్సంపేట నియోజకవర్గం ఖానా పురం మండల పరిధి లోని పాకాల లో "వనదర్శిని" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేట మదర్స్ ల్యాండ్ పాఠశాల విద్యార్థులు పాకాల అటవీ ప్రాంతంలోని పాకాల చెరువు, బట్టర్ ఫ్లై పార్క్, బయో డైవర్సిటీ పార్క్, అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రీనా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణం పై అవగాహన కొరకు "వనదర్శిని"కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వన సంరక్షణే మన సంరక్షణ అని తెలిపారు. వనాల(అడవుల) ను కాపాడుకుంటే నే మానవ మనుగడ అని అన్నారు. అడవులు వన్య ప్రాణులకు ఆవాసాలు అని, అడవులు రక్షింపబడితేనే జంతువులు రక్షింపబడతాయని అన్నారు. ప్రతీ ఒక్క విద్యార్థి తమ పుట్టినరోజు న ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పర్యావరణం పైన ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవికిరణ్ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రీనా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రమేష్ సునీత నార్య ఫారెస్ట్ డ్రైవర్ శివ స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ మదర్స్ ల్యాండ్ పాఠశాల కరెస్పాండెంట్ రమేష్ ప్రిన్సిపాల్ నవీత ఉపాధ్యాయులు సుధాకర్ బాలుకుమార్ మహేందర్ సరిత పద్మ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలను నడిపిన నలుగురు వ్యక్తులకు జైలు శిక్ష

మద్యం తాగి వాహనాలను నడిపితే చట్టరీత్యా చర్యలు...

పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి



**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి నవంబరు 21:** పట్టణంలో మద్యం తాగి వాహనాలను నడిపిన నలుగురు వ్యక్తులకు జైలు శిక్ష విధించారు. ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా నలుగురు వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడుపుతున్న వ్యక్తులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించి మద్యం సేవించి నట్టు తేలడంతో కేసు నమోదు చేసి న్యాయ స్థానంలో హాజరు పరిచారు. న్యాయమూర్తి అట్టి వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ...వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని,వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపేవారు అమాయకుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారని తెలిపారు.తాగి వాహనం నడపడం వల్ల కొన్ని వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మద్యం మత్తులో ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకూడదన్నారు.పోలీసులు ఎప్పుడు పౌర సమాజానికి మంచి స్నేహితులని మంచి చేసిన వారికి అండగా ఉంటూ చెడు చేసిన వారికి కచ్చితంగా శిక్ష ఉంటుందన్నారు

## స్వయం ఉపాధి తో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి



**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి నవంబరు 21:** మహిళలు స్వయం ఉపాధి తో ఆర్థికాభివృద్ధి సాధించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళ సహకార సాధికారత సంస్థ అధ్వర్యంలో కుట్టు మిషను శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి క్యాంప్ కార్యాలయంలో సర్టిఫికెట్లు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా స్వయం ఉపాధి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం ఉపాధి తో తమ తమ కుటుంబాలకు అర్థిక భరోసాను కల్పించాలన్నారు. నర్సంపేట మండలం మాదన్న పేట గ్రామానికి చెందిన 35 మంది కుట్టు మిషను శిక్షణా తరగతులు పూర్తి చేసుకొవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పావని జెండర్ స్పెషలిస్ట్ హర్షిత ఎస్ఎఫ్ఎల్ సుజాత వివో అధ్యక్షురాలు వీణ తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారి వీరాస్వామి కి వీడ్కోలు సమావేశం



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి నవంబరు 21:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రంగు వీరాస్వామి కి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సత్కరించారు ఈ సమావేశంలో కమిషనర్ మేనేజర్ డీఈ, ఆర్వో సానిటేషన్ ఇన్ స్పెక్టర్ లు,టౌన్ ప్లానింగ్ అధికారులు చైన్ మెన్స ఇంజనీరింగ్ విభాగం,రెవిన్యూ బిల్ కలెక్టర్ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడ మండల స్థాయి చెకుముకి పరీక్ష విజయవంతం





**షణ్ముఖ వెలుగు మరిపెడ ప్రతినిధి నవంబరు 21:** జన విజ్ఞాన వేదిక ప్రతి ఏటా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా మండల స్థాయి లో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టు ప్రశ్న పత్రాలను మరిపెడ కనకదుర్గ ఫంక్షన్ హాల్ లో ముఖ్య అతిథి ఎస్సై సంతోష్ తో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు బయగాని రామ్మోహన్ సంయుక్తంగా ఆవిష్కరించి మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ సంధర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడం కోసం ఎంతో దోహదపడుతుందని అన్నారు. సమగ్రాభివృద్ధి, శాస్త్రీయ దృక్పథం ను ప్రజలు అలవర్చు కొవాలని, మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాల నిర్మూలనకు ప్రజలందరు కృషి చేయాలని అన్నారు. జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు బయగాని రాం మోహన్ మాట్లాడుతూ ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, శాంతి కోసం సైన్స్, దేశం కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదాలతో జన విజ్ఞాన వేదిక పని చేస్తుందని, శాస్త్ర ప్రచారం చేస్తూ, ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుంది అని అన్నారు. మధ్యాహ్నం సమావేశంలో ముఖ్య అతిథిగా మరిపెడ మండల తహసిల్దార్ సైదులు ఫలితాలు ప్రకటించి విద్యార్థులందరూ ఉత్సాహంగా పరీక్షలో పాల్గొన్నారని మండల స్థాయి వరకు వచ్చారంటే అందరూ కూడా తెలివైన వారేనని, విజేతలుగా జిల్లా స్థాయికి ఎంపికైన వారిని అభినందిస్తూ జిల్లా స్థాయిలో కూడా రాణించాలని కోరారు. గౌరవ అతిధి మండల విద్యాధికారి మాట్లాడుతూ చెకుముకి రాయి లాగా నిద్రావస్థలో ఉన్న మెదళ్లను పదునెక్కించడం కోసమే ఇలాంటి పరీక్షలు దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ వివిధ ఉదాహరణలతో విద్యార్థులను ఉత్తేజ పరిచారు మండల స్థాయిలో 20 పాఠశాలలు చెకుముకి టాలెంట్ టెస్ట్ లో పాల్గొనగా ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం నుండి చిల్లంచర్ల ఉన్నత పాఠశాల, తెలుగు మాధ్యమం నుండి వీరారం ఉన్నత పాఠశాల, రెసిడెన్షియల్ విభాగం నుండి ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమం నుండి గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ పాఠశాలల్లో ప్రథమ స్థానం పొంది, జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు మాజీ జడ్పిటిసి శారద రవీందర్ నాయక్ ఐదు వేల రూపాయల విలువైన జ్ఞాపికల ను బహుకరించారు. ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో ఈ నెల 28 పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 120 మందికి ప్రముఖ విద్యావేత్త లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ప్రిన్సిపల్ ఠాగూర్ జూనియర్ కాలేజ్ పార్టనర్ మెంచు అశోక్ అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త, వార్డు సభ్యులు జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు ఊరుగొండ శ్రీనివాస్ కనకదుర్గ ఫంక్షన్ హాల్ వేదిక ను ఇచ్చారు. సహకరించిన వారందరికీ పేరుపేరునా బయగాని రామ్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు సలహాలు సూచనలు ఇచ్చిన మరిపెడ అదనపు ఎస్సై గంద్ర సంతోష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్, మరిపెడ స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ డి. అనంతరావు, సీతారాంపురం కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ ఎం. రామచంద్రులు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు శ్రీ సాయి సాందీపని ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి నవీన్ చెకుముకి కన్వీనర్ సుభాన్ ట్రెజరర్ లాల్ చంద్, జనార్దనా చారి వీరన్న రాజేశ్వర్ రావు మంగు రాజకుమారి మీడియా కన్వీనర్ వంకాయ పాటి తిరుమలరావు గైడ్ టీచర్స్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ ల రద్దుకు, పంటల మద్దతు ధర చట్టంకై పోరాడుదాం






సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్

**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి నవంబరు 21:** రైతుల పంటల కనీస మద్దతు ధర చట్టానికై, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ ల రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె యం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు.

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26 న జరిగే కార్మిక కర్షక ప్రజా దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలని కోరుతూ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ను సందర్శించి రైతులను కార్మికులను కలుసుకొని కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు కార్మిక హక్కుల కోసం జరిగే దేశవ్యాప్త ఉద్యమాలలో రాజకీయాలకతీతంగా పాల్గొని పాలకుల మెడలు వంచాలని పిలుపునిచ్చారు. రైతాంగం ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేక ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగి అప్పుల పాలై ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన కేంద్ర రాష్ట్ర పాలకులు అది విస్మరించి మరింత సంక్షోభంలోకి నెట్టే విధంగా రైతులకు ఇచ్చే సబ్సిడీలను రాయితీలను తగ్గిస్తున్నారని విమర్శించారు. మార్కెట్ వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాల రూపకల్పన చేస్తున్నారన్నారు. మరోవైపు కార్మికుల శ్రమను దోచుకోవడానికి ఎన్నో పోరాటాలతో సాధించుకున్న చట్టాలను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చారన్నారు. ఈ క్రమంలో పని గంటలను పెంచి కనీస వేతనం పెంచకుండా నిర్బంధంగా పని చేయించుకునే వెసులుబాటు పెట్టుబడిదారులకు కల్పిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలే శరణ్యమని అన్నారు. అందులో భాగంగానే ఈనెల 26 న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ నిరసన కార్యక్రమాలకు రైతులు కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె యం) జిల్లా కన్వీనర్లు వీరగోని శంకరయ్య సోమిడి శ్రీనివాస్ రాచర్ల బాలరాజు కార్మిక సంఘాల జిల్లా బాధ్యులు ముక్కెర రామస్వామి గన్నారపు రమేష్ సుంచు జగదీశ్వర్ పుల్ల రమేష్ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి సుధ మల్లు భాస్కర్ ఎస్ కే యం జిల్లా కన్వీనర్ కుసుంబ బాబూరావు కార్మిక సంఘాల బాధ్యులు గంగుల దయాకర్ కార్మిక రైతు సంఘాల జిల్లా నాయకులు మాలోత్ సాగర్ ఓదెల రాజన్న చుక్క మొగిలి ఎంఎ పాషా ఐతం నాగేష్ ఊరటి హంసల్ రెడ్డి రాయి నేని ఐలయ్య అజయ్ పరిమళ గోవర్ధన్ రాజు గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కుల గణన అధికారులకు ప్రజలందరూ సహకరించాలి :

పావని జంగయ్య యాదవ్



**షణ్ముఖ వెలుగు ఘట్ కేసర్ ప్రతినిధి నవంబరు 21:** ఘట్ కేసర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ నివాసంలో కుల గణన అధికారులకు వివరాలు అందించారు ఈ సందర్భంగా చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కార్యక్రమం చేపట్టిందని బడుగు బలహీన వర్గాలు, వెనుకబడిన కులాల జాబితా ను సిద్ధం చేసి అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా మంచి నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అని, కావున మేము సైతం మా యొక్క కుటుంబ వివరాలు కుల గణన అధికారులు అందించామని తెలుపుతూ, అధికారులు ఖచ్చితత్వం తో కూడిన సర్వే నిర్వహించాలని, ఎక్కడ ఏ పొరపాటు జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా ప్రజలు కూడా కుల గణన చేస్తున్న అధికారులకు సహకరించాలని అన్నారు.

# సన్నవడ్లకు బోనస్ పేరుతో బోగస్ మాటలు

**ధాన్యం కొనుగోళ్ళ కోసం రైతన్నల ఎదురు చూపులు**

**షణ్ముఖ వెలుగు ఖానా పురం ప్రతినిధి నవంబరు 21:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సూచన మేరకు బిఆర్ఎస్ మండల నాయకులు వేములపల్లి ప్రకాష్ రావు మహాలక్ష్మి వెంకట నర్సయ్య ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నర్సంపేట నియోజకవర్గం ఖానా పురం మండలంలోని బుధరావుపేట మంగళావారిపేట గ్రామాల్లో ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లపై ధాన్యం పోసి ప్రభుత్వం కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ప్రకాష్ రావు వెంకట నర్సయ్యలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రచార ఆర్భాటం కోసమే ప్రారంభించారే తప్ప రైతుల పై ఆరాటం కోసం కాదన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోగస్ మాటలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ సారథ్యంలో గత ప్రభుత్వంలో కొనుగోలు వేగవంతం చేస్తే ఈ ప్రభుత్వంలో ఎందుకు జాప్యం జరుగుతుందో తెలియడం లేదన్నారు. తాలు తేమ పేరుతో వరి ధాన్యంలో కటింగ్ చేసి రైతును నష్టపరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నర్సంపేట నియోజవర్గ వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యే సందర్శించిన పాపన పోలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం పోసి 20 రోజులు కావస్తున్నా ఇంతవరకు కొనుగోలు చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం 12 శాతం మ్యాచర్ తో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్నాయని, వీటిని కొనే నాథుడె కరువయ్యారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే బోనస్ తో కొనుగోళ్లు చేపట్టకుంటే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కాస ప్రవీణ్ కుమార్ లావుద్య రమేష్ వల్లెపు సోమయ్య భూక్యా పద్మావతి-వెంకన్న సొసైటీ డైరెక్టర్ ఆబోతు అశోక్ బిఆర్ ఎస్ పార్టీ నాయకులు వేల్పుల లింగయ్య తొట్ల వెంకన్న నాగార్జున రెడ్డి మురళి కృష్ణారెడ్డి గుగులోతు బాలు నాయక్ రామ్మూర్తి పసునూరి వెంకటేశ్వర్లు ఫైండ్ల యాదగిరి గొంది నర్సయ్య మక్క వెంకన్న మోతిలాల్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## తొలిసారిగా కాగ్ పదవిలో తెలుగు వ్యక్తి



భారత ప్రభుత్వ వ్యవస్థల్లో కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) అత్యంత కీలకమైనది. ప్రభుత్వాల ఆదాయ, వ్యయాలు, గణాంకాలపై కాగ్ పర్యవేక్షణ ఉంటుంది. ఈ నేపథ్యంలో, భారత నూతన కాగ్ గా కొండ్రు సంజయ్ మూర్తి నియమితులయ్యారు. ఇవాళ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమక్షంలో కాగ్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటిదాకా గిరీశ్ చంద్ర ముర్ము కాగ్ గా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, సంజయ్ మూర్తి కాగ్ గా నియమితుడు కాకముందు కేంద్ర ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా వ్యవహరించారు. సంజయ్ మూర్తి ఏపీలోని కోనసీమ జిల్లాకి చెందిన వ్యక్తి. ఈ విశిష్ట పదవి చేపట్టిన తొలి తెలుగు ఐఏఎస్ అధికారిగా ఘనత అందుకున్నారు. సంజయ్ మూర్తి... అమలాపురం మాజీ ఎంపీ కేఎస్సార్ మూర్తి తనయుడు. కేఎస్సార్ మూర్తి 1996లో కాంగ్రెస్ తరఫున లోక్ సభ ఎన్నికల్లో గెలిచారు. సంజయ్ మూర్తి తండ్రి కేఎస్సార్ మూర్తి కూడా రాజకీయాల్లోకి రాకముందు ఐఏఎస్ అధికారిగా సేవలు అందించారు. కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి హోదాలో బాధ్యతలు నిర్వహించారు ఇక, సంజయ్ మూర్తి విషయానికొస్తే... 1964 డిసెంబరు 24న జన్మించారు. మెకానికల్ ఇంజినీరింగ్ లో పట్టభద్రులయ్యారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. సంజయ్ మూర్తి హిమాచల్ ప్రదేశ్ క్యాడర్ 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం తీసుకురావడంలో ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా కీలకపాత్ర పోషించారు. వాస్తవానికి సంజయ్ మూర్తి ఐఏఎస్ గా వచ్చే నెలలో రిటైర్ అవ్వాల్సి ఉంది. అయితే, ఆయన అందించిన విశిష్ట సేవలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం కాగ్ గా కీలక పదవిలో నియమించింది.

## మోదీకి అరుదైన గౌరవం



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి మరో అరుదైన గౌరవం దక్కింది. గయానా, డొమెనికా దేశాలు తమ అత్యున్నత పురస్కారాలతో ప్రధానిని సత్కరించాయి. ప్రస్తుతం గయానా పర్యటనలో ఉన్న మోదీ ఈ రెండు పురస్కారాలను అందుకున్నారు. ముందుగా డొమెనికా అధ్యక్షురాలు సిల్వానీ బర్టన్ తమ దేశ అత్యున్నత జాతీయ అవార్డు 'డొమెనికా అవార్డ్ ఆఫ్ ఆనర్'తో మోదీని సత్కరించారు. కొవిడ్ సమయంలో తమ దేశానికి మోదీ అందించిన సహాయ సహకారాలకు గానూ ఈ అవార్డును అందించారు. అదేవిధంగా గయానా కూడా తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఆ దేశాధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్ మోదీకి అందించారు. ఈ సందర్భంగా రెండు దేశాలకు ప్రధాని మోదీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డును కోట్లాది మంది భారతీయులకు అంకితం ఇస్తున్నట్లు మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# 14,082 బీపీఎల్ కార్డుల రద్దు

**బళ్లారిలో 12,950, విజయనగర జిల్లాలో 1,132**

**దాదాపు మూడు వేల కార్డులు ఏపీఎల్‌గా మార్పు**



**బళ్లారి(బెంగళూరు):** బీపీఎల్(బిలో పావర్టీ లైన్) రేషన్ కార్డుల ఏరివేతలో భాగంగా బళ్లారి, విజయనగర జిల్లాల్లో అనర్హులుగా గుర్తించి 14,082 మంది కార్డులు రద్దు చేశారు. బళ్లారి జిల్లాలో మొత్తం 12,950 మంది అనర్హులు బీపీఎల్ కార్డులు పొందినట్లు గుర్తించి, రద్దు చేసినట్లు ఆహార పౌరసరఫరా అధికారులు తెలిపారు. ఇందులో ఆదాయ పన్ను చెల్లించే కుటుంబాలు 1,772 ఉన్నాయని, వారి కార్డులను ఏపీఎల్‌గా మార్పు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'కుటుంబ' సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఆదాయ పన్ను చెల్లింపు దారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సంవత్సరాదాయం రూ. 1.2లక్షలకు పైబడిన వారిని అనర్హులుగా గుర్తించి, కార్డులు రద్దు చేసినట్లు తెలిపారు.

బళ్లారి జిల్లాలో తాలూకా వారిగా పరిశీలిస్తే, బళ్లారి తాలూకా 5,431 మంది అనర్హులు వద్ద బీపీఎల్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 21 కార్డులు రద్దు చేయగా, మిగతా వాటి రద్దు ప్రక్రియ కొనసాగుతోంది. బళ్లారి గ్రామీణ ప్రాంతాల్లో 22 కార్డులు, కంప్లి 1,242 కార్డులు గుర్తించగా, వాటిలో ఇప్పటి వరకు 83 కార్డులు రద్దయ్యాయి. కురుగోడులో 348 కార్డులు, సండూరులో 2,775, సిరుగుప్ప 1,454 అనర్హుల వద్ద బీపీఎల్ కార్డులు ఉన్నట్లు తేలిందన్నారు. జిల్లాలో 71మంది ప్రభుత్వ ఉద్యోగులు బీపీఎల్ కార్డులు పొందగా, ప్రస్తుతం వాటిని ఏపీఎల్ కార్డుగా మార్పు చేసినట్లు తెలిపారు. బళ్లారి తాలూకాలో 30, బళ్లారి రూరల్ 6, కురుగోడు 3, సండూరు 14, సిరుగుప్పలో 13మంది ప్రభుత్వ ఉద్యోగుల వద్ద బీపీఎల్ కార్డులు ఉన్నట్లు ఆహార పౌరసరఫరా శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 2012-2024 మధ్య కాలంలో 2,813మంది అనర్హుల వద్ద బీపీఎల్ కార్డులు ఉన్నట్లు గురించి వారి నుంచి జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో మృతి చెందిన వారిపేరుపై 3,576 కార్డులు ఉన్నట్లు గుర్తించి, రద్దు చేసినట్లు తెలిపారు. ఒక్క బళ్లారి నగరంలోనే 1,556 ఇలాంటి కార్డులను గుర్తించారు. కంప్లిలో 341, కురుగోడు 282,సండూరు 89, సిరుగుప్పలో 808 మృతిచెందిన వారిపై ఉన్న కార్డులు రద్దు చేశారు.

**ఆరు నెలలు రేషన్ పొందని కార్డులు సస్పెన్షన్**

జిల్లాలో బీపీఎల్ కార్డులు ఉన్న వారు వరుసగా ఆరు నెలల పాటు చౌకధరల ధాన్యం డిపోల నుంచి సరుకులు తీసుకోకపోతే వారి కార్డులు సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాంటివి ఇప్పటి వరకు 7488 కార్డులను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. రేషన్ పొందక పోవడానికి సరైన కారణాలు చూపి ఆధారాలు అందజేస్తే సస్పెన్షన్ తొలగిస్తామని చెప్పారు.

**విజయనగర జిల్లాలో 1132 బీపీఎల్ కార్డుల రద్దు**

విజయనగర జిల్లాలో 1132 అనర్హుల కార్డులను రద్దు చేసినట్లు ఆహార పౌరసరఫరా అధికారులు పేర్కొన్నారు. ఆరు నెలలుగా రేషన్ పొందని 9,326 కార్డులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. వీరితో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న 101 మంది, ఆదాయ పన్ను చెల్లించే 1,031 మంది బీపీఎల్ కార్డులను ఏపీఎల్‌గా మార్చినట్లు తెలిపారు. సుమారు మూడు నెలల పాటు జిల్లాలో కార్డుల ఏరివేత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రంగుమారుతున్న 'తుంగభద్ర' జలం



**కంప్లి(బెంగళూరు):** ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జీవనాడి అయిన తుంగభద్ర జలాశయంలో నీరు రోజురోజుకు రంగుమారుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్?లో అల్పపీడనం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ఈ కలుషిత నీటి వల్ల రబీ పంటలో కూడా దెబ్బతింటాయేమోనని ఆందోళన చెందుతున్నారు. కొప్పాళ, విజయనగర, బళ్లారి, రాయచూరు జిల్లాలకు కూడా ఈ జలాశయం నుంచి తాగునీరు అందుతుంది. కలుషిత నీటి వల్ల ఎక్కడ అనారోగ్యానికి గురవుతామోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతు సంఘ నాయకులు సింధిగేరి గోవిందప్ప మాట్లాడుతూ జలాశయానికి పైభాగంలో ఉండే హరప్పనహళ్లి, హగరి బొమ్మనహళ్లి, తదితర ప్రాంతాల్లోని కర్మాగారాలు వ్యర్థ పదార్థాలను జలాశయంలోకి వదులుతుండటం వల్ల నీరు కలుషితమై పచ్చరంగులోకి మారుతున్నాయన్నారు. దీని వల్ల ఇటు రైతులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. అలాగే వేసవి సమయంలో కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి జలాశయంలో నీరు కలుషితం కాకుండా చూడాలని కోరారు. లేకపోతే జలాశయం ఎదుటనే నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## పాక్‌లో ప్రయాణికుల వాహనాలపై ఉగ్రవాదుల కాల్పులు


పాకిస్థాన్‌లో ప్రయాణికుల వాహనాలపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 50 మంది మరణించారు. 20 మంది గాయపడ్డారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కుర్రం జిల్లాలో గురువారం ఈ ఘటన జరిగింది. బాధితుల్లో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. కుర్రం జిల్లాలో కొన్ని కారణాల వల్ల ఓ కీలక రహదారిని కొన్ని వారాలపాటు మూసివేయగా, దానిని ఇటీవల తెరిచారు. ఈ మార్గంలోనే పరాచినార్ నుంచి పెషావర్‌కు ప్రయాణికులతో వెళు_న్న వాహనాలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో బాధితుల సంఖ్య మరింత పెరగవచ్చని ప్రావిన్స్ చీఫ్ సెక్రటరీ నదీమ్ అస్లాం చౌధ్రీ తెలిపారు.

## 10, 12వ తరగతి బోర్డు పరీక్షల తేదీలు విడుదల

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 10, 12వ తరగతులకు సంబంధించి 2025 సంవత్సరానికి పరీక్ష తేదీలను ప్రకటించింది. ఇంతకుముందు %జదీూజు% బోర్డు చెప్పినట్లుగా విడుదల చేసిన తేదీషీట్ ప్రకారం %జదీూజు% బోర్డు 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15న ప్రారంభమవుతాయి. మొదటి పేపర్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా ఉంటుంది. ఇది కాకుండా 10వ తరగతి బోర్డు పరీక్షలు ఫిబ్రవరి 15, 2025న ఇంగ్లీష్ పేపర్‌తో మొదలవుతాయి. గత కొన్నేళ్ల సంప్రదాయానికి స్వస్తి చెప్పి ఈసారి ప్రధాన సబ్జెక్టులకు ముందుగా పరీక్షలు నిర్వహించాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. 10వ తరగతి పరీక్షలు మార్చి 18 వరకు, 12వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి.

# అత్యంత కాలుష్య నగరాల్లో ఢిల్లీ ఫస్ట్..

### ఐజ్వాల్ లాస్ట్.. హైదరాబాద్‌లో ఏక్యూఐ లెవల్స్ ఎంతంటే..?



దేశరాజధాని ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రధాన నగరాల్లో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్న విషయం తెలిసిందే. ఢిల్లీ, యూపీ, నోయిడా, లక్నో సహా పలు ప్రధాన నగరాల్లో గాలి నాణ్యత సూచీ క్షీణించింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 400కుపైనే నమోదవుతోంది. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో గురువారం వాయు నాణ్యత సూచీ 400 దాటడంతో గ్యాస్ ఛాంబర్‌గా మారింది. ఫలితంగా జనం ఊపిరిపీల్చుకునేందుకు తిప్పలు పడుతున్నారు. ఢిల్లీతోపాటు ఐదు ప్రధాన నగరాల్లో ఇవాళ (గురువారం) గాలి నాణ్యత పేలవమైన స్థాయిలో నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. అత్యంత కాలుష్య నగరాల జాబితాలో (%వీశీర్ ్రాశీశ్రీబ్‌వస జ్‌ఎ%) ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 379తో తొలి స్థానంలో నిలిచింది. రాజధానిలోని పలు ప్రాంతాల్లో ఏక్యూఐ లెవల్స్ 400 కూడా దాటాయి. ఇక ఢిల్లీ తర్వాత జైపూర్, ఛండీగఢ్ నగరాల్లో గాలి నాణ్యత పూర్ కేటగిరీలో నమోదైంది. ఇక్కడ వరుసగా ఏక్యూఐ లెవల్స్ 235, 233గా నమోదయ్యాయి. ఐజ్వాల్, గువాహటిలో అత్యల్ప కాలుష్య స్థాయిలు ఉన్నాయి. ఇక్కడ ఏక్యూఐ రీడింగ్‌లు వరుసగా 32, 42గా నమోదయ్యాయి. ఇక్కడి ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ.. ఆరోగ్యకరంగా జీవిస్తున్నారు.

**దేశంలోని పలు ప్రధాన నగరాల్లో గాలి నాణ్యత సూచీ ఇలా ఉంది..**

ఢిల్లీలో ఏక్యూఐ లెవల్స్ 379తో చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. ఆ తర్వాత జైపూర్‌లో 235, ఛండీగఢ్‌లో 233, చెన్నైలో 223, భోపాల్‌లో 208, పాట్నా 205తో పూర్ కేటగిరీలో ఉన్నాయి. కోల్‌కతాలో 189, లక్నోలో 187, అహ్మదాబాద్‌లో 164, ముంబైలో 154, భువనేశ్వర్‌లో 150, హైదరాబాద్‌లో 122, రాయ్‌పూర్‌లో 116, బెంగళూరులో 104గా ఏక్యూఐ లెవల్స్ నమోదయ్యాయి. ఇది మితమైన గాలి నాణ్యతను సూచిస్తుంది. తిరువనంతపురంలో గాలి నాణ్యత 57తో సంతృప్తికరంగా ఉంది. ఆ తర్వాత ఐజ్వాల్‌లో గాలి నాణ్యత సూచీ 32, గువాహటిలో 42 వద్ద నమోదైంది. దీన్ని మంచి కేటగిరీ కింద భావిస్తారు. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు. అయితే, గత కొంతకాలంగా ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారుతోన్న విషయం తెలిసిందే. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు.. మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కారణంగా నగర వాసులు తీవ్ర అనారోగ్య సమస్యకు గురికావాల్సి వస్తోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం.. గురువారం ఉదయం 8 గంటలకు ఢిల్లీలోని ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 405గా రికార్డయ్యింది. ముండ్కాలో 413, బవానాలో 418, అశోక్ విహార్‌లో 414, ఐటీవోలో 355, జహంగీర్‌పురి 435, రోహిణి 407 రికార్డయ్యింది. నజాఫ్‌గఢ్ 366, ఆర్‌కేపురం 387, పంజాబీ బాగ్ 407, సోనియా విహార్ 394, ద్వారకా సెక్టార్-8 వద్ద 401 నమోదైంది.

## 5.8 కోట్ల నకిలీ రేషన్ కార్డుల ఎత్తివేత



దేశంలో 5.80 కోట్ల నకిలీ రేషన్ కార్డులను తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటివరకు 20.40 కోట్ల రేషన్ కార్డుల డిజిటలీకరణ పూర్తి అయినట్లు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా దేశంలో మొత్తంగా 80.60 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని తెలిపింది. ఆధార్ ధ్రువీకరణ, ఈ-కేవైసీ వెరిఫికేషన్‌ల ద్వారా దేశవ్యాప్తంగా 5.80 కోట్ల నకిలీ రేషన్ కార్డులను తొలగించినట్లు వివరించింది. దేశవ్యాప్తంగా 5.33 లక్షల చౌక ధరల దుకాణాలకు ఈపోస్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం తెలిపింది. వీటి సాయంతో 99.8 శాతం కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయగా, 98.7 శాతం లబ్ధిదారులకు బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తైనట్లు వెల్లడించింది. ఈ-కేవైసీ ప్రక్రియతో ఇప్పటి వరకు 64 శాతం లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తయ్యిందని కేంద్రం తెలిపింది. డిజిటైజేషన్ కారణంగా పీడీఎస్?లో భారీ స్థాయిలో మార్పులు వచ్చినట్లు, తద్వారా ఆహార భద్రతలో ప్రపంచానికే కొత్త బెంచ్ మార్కును నెలకొల్పినట్లు అయ్యిందని కేంద్రం తెలిపింది. ఇదిలా ఉండగా, ఆహార పదార్థాల సరఫరా విషయంలోనూ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పకడ్బందీగా వ్యవహరిస్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలో సరకు రవాణాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా ఓ వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌నూ రైల్వేలతో అనుసంధానం చేశామంటూ తెలిపింది. ఇక వన్ నేషన్ - వన్ రేషన్ కార్డు పథకం వల్ల లబ్ధిదారులు దేశంలో ఎక్కడైనా సరకులు తీసుకునే అవకాశం ఏర్పడిందని పేర్కొంది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com